# సిలువ మీద దొంగ సంగతి ఏమి?

## మత్తయి 27:38-44;

## లూకా 23:39-43, పరిశీలన

సిలువపై వ్రేలాడుచుండగనే, తన ప్రక్కన సిలువపైనున్న దొంగతో నేడు నీవు నాతో కూడ పరదైసులో నుందువు అని ప్రభువైన యేసు వాగ్దానం చేశారు. ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చారని నమ్ముతున్నాం-అంటే, ఆ దొంగ చనిపోయినప్పుడు, లాజరు ఉన్న చోటికి, దేవ దూతలచేత అబ్రాహాము రొమ్మున ఆనుకొనుటకు కొనిపోబడెను (లూకా 16:22). క్రైస్తవేతరులు ఈ విధానంలో రక్షణ పొందాలనే మాదిరిగా యిది యివ్వబడలేదు.

ఆ దొంగను గూర్చి పలువిషయాలు ఊహించబడ్డాయి: ఉదాహరణకు, "అతడు దూరస్థుడైన పాపియైనట్టు" అనేకులు ఊహిస్తారు. "దూరస్థ"డంటే, పౌరుడు కాని వాడని ప్రాథమిక అర్థం; దేవుని రాజ్య పౌరుడు కాడని లేఖనాల్లో కొన్ని సార్లు సూచింపబడుతుంది (ఎఫెసీ. 2:19 చూడు). ఇలా నమ్మేవారు, ఆ దొంగ యొక్క రక్షణ "దూరస్థులైన పాపులకు", అంటే క్రైస్తవేతరులకు ముందు మాదిరిగా నిలుపబడిందని భావిస్తారు. ఏదియెలాగున్నా ఆ దొంగ దూరస్థులైన పాపుల వర్గంలో గాక, "త్రోవ తప్పిన దేవుని బిడ్డల" వర్గంలో పడతాడు. దీన్ని గూర్చి ఆలోచించు: అతన్ని సిలువ వేసిందెవరు? రోమీయులు. రోమీయులు రోమా పౌరులను సిలువ వేస్తారా? లేదు.[1] ఎవరిని వారు సిలువేస్తారు? ఒక పరిధిలోని అవిధేయులైనవారిని. ఆ ప్రాంతంలో ఉన్న జనులు యూదులే. ఆ దొంగ యూదుడని మనం క్షేమంగా ఊహించవచ్చు. మరియొక దొంగతో- "నీవు దేవునికి భయపడవా?" అనే మాటలు అతడు యూదుడని సూచిస్తున్నాయి. అన్యజనులలో అనేకులు "దేవునికి" బదులు "దేవతలను" సూచిస్తారు. అయితే, అతడు విధేయుడైన యూదుడు కాడు, అతడు పది ఆజ్ఞలలో కనీసం ఒకదానినైనా అతిక్రమించాడు (నిర్గమ. 20:15). ఏదియెలాగున్నా, అతడు యూదుడే. అది అతన్ని దేవుని బిడ్డగా చేస్తుంది, ఎందుకంటె-క్రీస్తు మరణంవరకు-యూదులు దేవుని ఏర్పాటులోని జనులైయున్నారు (ద్వితీయో. 7:6). ఆ దొంగ యొక్క రక్షణ ఏ ఉదాహరణంగా నైనా పనిచేస్తే త్రోవ తప్పిన క్రైస్తవునికే వర్తిస్తుంది గాని, క్రైస్తవేతరునికి వర్తించదు.

పైగా, ఆ దొంగ బాప్తిస్మం పొందనట్టు ఊహించబడింది. కొన్ని సంవత్సరాలకు ముందు బాప్తిస్మమిచ్చు యోహాను పనిచేసిన ప్రాంతంలో అతడు చనిపోయాడు. యోహాను యొక్క ఆరంభపు ప్రజాభినందన గూర్చి మత్తయి యిలా రాశాడు: "ఆ సమయమున యెరూషలేము వారును యూదయ వారందరును యోర్దాను నదీప్రాంతములవారును, అతని యొద్దకు వచ్చి, తమ పాపములు ఒప్పుకొనుచు, యోర్దాను నదిలో అతని చేత

బాప్తిస్మము పొందుచుండిరి" (మత్తయి 3:5, 6). ఆ ప్రాంతంలో నివసించిన అనేకులు యోహాను చేత బాప్తిస్మము పొందారు. తరువాత, ప్రభువైన యేసు అదే ప్రాంతంలో తన పరిచర్యను ప్రారంభించినప్పుడు, ఆయనయు, ఆయన శిష్యులును యోహాను కంటె ఎక్కువ మందికి బాప్తిస్మం యిచ్చినట్లుంది (యోహాను 4:1; 3:26 చూడు). ఏదో ఒక సమయంలో, యోహాను చేత గాని, క్రీస్తు ప్రభువు శిష్యుల చేతగాని ఆ దొంగ బాప్తిస్మం పొందే అవకాశం లేదా? అది జరిగినది, లేనిది అంత ప్రాముఖ్యం కాదు, బైబిలు మూలం మీద ఆధారపడే వాదం ఊహలతో కూడినదై యుండకూడదు.

ఆ దొంగ బాప్తిస్మం పొందినా లేకున్నా అంత ప్రాముఖ్యం కాదని ఎందుకు అంటున్నాను? ముందుగా చెప్పినట్టే, అతని రక్షణ నేటి క్రైస్తవేతరునికి ఎన్నడే మాదిరియైయుండనేరదు, ఇలా అనడానికి మూడు కారణాలను చూద్దాం.

## పాతనిబంధన తీసివేయబడక మునుపు అతడు రక్షింపబడ్డాడు

సిలువ మీద దొంగ యొక్క మార్పు నేటి క్రైస్తవేతరులకు వర్తింపజేయడం, 2 తిమోతి 2:15లో బోధింపబడిన సూత్రాన్ని అతిక్రమించుటయే ఔతుంది. "దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గుపడనక్కరలేని పనివానిగాను సత్య వాక్యమును సరిగా విభజించువాని గాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము" సత్యవాక్యాన్ని సరిగా విభజించడంలో పాత నిబంధనకు, క్రొత్త నిబంధనకు మధ్య వ్యత్యాసాన్ని గమనించవలసి యుంటుంది.

క్రీస్తు మరణము పాత, క్రొత్త నిబంధనలను విడదీసే పాయింటైయుంటున్నట్టు బైబిలు బోధిస్తుంది. పౌలు కొలస్సయులకు వ్రాస్తూ యిలా అన్నాడు: "...దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దాని మీద చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డములేకుండ దానిని ఎత్తివేసి మన అపరాధములన్నిటిని క్షమించి, ఆయనతో కూడ మిమ్మును జీవింపజేసెను" (కొలస్సీ. 2:13, 14). అపొస్తలుని మనస్సులో ఏ ఆజ్ఞలను గూర్చిన ప్రశ్న ఉందో తెలిసికొనగోరితే, 16వ వచనంలో వాటి విషయం యిలా సూచించాడు: "అన్నపానముల విషయములోనైనను, పండుగ అమావాస్య విశ్రాంతి దినము" అనువాటి విషయములోనైనను, మీకు తీర్పు తీర్చ ఎవనికిని అవకాశమియ్యకుడి. "సబ్బాతు దినము" అనే ప్రయోగంలో, పౌలు మోషే ధర్మశాస్త్రాన్ని గూర్చి మాట్లాడుతున్నట్టు తేలిపోయింది. "సబ్బాతు దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకము చేసికొనుడని" చెప్పేది పాత నిబంధనయే (నిర్గమ. 20:8).

"చేవ్రాతను తుడిచివేసి" "మనకు అడ్డంలేకుండ ఎత్తివేసి" అనేవి ధర్మశాస్త్రం తొలిగించ బడిందనడానికి బలంగా ఉపయోగించిన పదాలు. అది ఎప్పుడు సంభవించింది? "మేకులతో సిలువకు కొట్టి" అనే ప్రయోగాన్ని గమనించు, దాని ఆజ్ఞలన్నిటిని పరిపూర్ణంగా అనుసరించి, ధర్మశాస్త్రాన్ని నెరవేర్చింది క్రీస్తు ఒక్కడే. ఆయన జీవితపు అంతంలో, అది

నెరవేర్చబడిన (ముగించబడిన) ఒప్పందమైయుంది. క్రీస్తు మరణమందు పాతనిబంధన "మనకు అడ్డములేకుండ ఎత్తి వేయబడింది."

అదే సమయంలో, క్రొత్త నిబంధన అమలులోనికి వచ్చింది. హెబ్రీ. 9:15లో, క్రీస్తు క్రొత్త నిబంధనకు మధ్యవర్తియైయున్నట్టు తెలిపాడు. క్రొత్తనిబంధన అమలుకు రాకముందు ఏమి జరిగిందో అతడు వివరించాడు: "మరణ శాసనమెక్కడ ఉండునో అక్కడ మరణశాసనము వ్రాసినవాని మరణము అవశ్యము. ఆ మరణ శాసనము వ్రాసిన వాడు మరణము పొందితేనే అది చెల్లును; అది వ్రాసిన వాడు జీవించుచుండగా అది ఎప్పుడైనను చెల్లునా?" (హెబ్రీ. 9:16, 17). ఇది క్రీస్తు యొక్క "వీలునామాను గూర్చి మాట్లాడబడింది." ఆ "వీలునామా ఎప్పుడు అమలులోనికి" వచ్చింది? వీలునామా రాసిన వ్యక్తి చనిపోయినప్పుడు – అంతకుముందు కాదు. "క్రీస్తు యొక్క వీలునామ (క్రొత్త నిబంధన)" ఎప్పుడు అమలులోనికి వచ్చింది? ఆయన మృతినొందినప్పుడు, క్రీస్తు మరణము పాత నిబంధన యుగాంతమును, క్రొత్త నిబంధన యుగారంభములునైయుంది.

నేటి క్రైస్తవేతరుల రక్షణకు సిలువ మీద దొంగ ఉదాహరణయై యుండడు, ఎందుకంటే పాతనిబంధన తీసివేయబడకమునుపే అతడు రక్షింపబడ్డాడు. క్రీస్తు చనిపోడానికి కొన్ని గంటలకు ముందే పరదైసుకు వెళ్లే వాగ్దానాన్ని అతనికి చేశారు. అయినా, ఆ వాగ్దానం సిలువకు "పాత నిబంధన వైపునే" అది సూచిస్తుంది.

క్రొత్త నిబంధన వీలునామాకు పోల్చబడింది. వీలునామా యొక్క అసలైన ఉద్దేశం ఆస్తి పంపిణి. వీలునామా వ్రాసినవాడు మరణించిన తోడనే, అందులో వ్రాయబడిన షరత్తులు వర్తింపజేయబడతాయి. వీలునామా రాసిన వ్యక్తి బ్రదికి యున్నంత కాలం, తన యిష్టము వచ్చినట్టు తన ఆస్తిని పంచిపెట్టుకోవచ్చు.

దైవ ప్రేరేపితమైన రికార్డు వెళ్లినంత మట్టుకు, తన భూనివాస కాలపు పరిచర్యలో, క్రీస్తు పాపములను క్షమించే హక్కును వినియోగించుకున్నది బహు కొద్ది సార్లు మాత్రమే: పక్షవాయువుగల వానికి (మత్తయి 9:2-6), వ్యభిచారమందు పట్టబడిన స్త్రీకి (యోహాను 8:3-11), మరియు సిలువమీద దొంగకు. ఆయన "వీలునామా" అక్కడవరకు అమలులో లేదు. గనుక, అదే విధంగా నేడు క్రైస్తవేతరులు రక్షింపబడతారని ఎవరే స్థాపించ కూడదు.

## క్రీస్తు గ్రేట్ కమిషన్ యివ్వకముందు అతడు రక్షింపబడ్డాడు

క్రీస్తు వ్యక్తిగతమైన పరిచర్య కాలంలో, రక్షణకు అవసరమైన షరత్తులను ఆయన సూచించుతూ వచ్చారు. ఉదాహరణకు, ఆయన నూతన జన్మ అవసరతను గూర్చి మాట్లాడారు (యోహాను 3:3, 5), మార్పు యొక్క అవసరతను గూర్చి మాట్లాడారు (మత్తయి 18:3). విశ్వాసము యొక్క అవసరతను గూర్చి ఆయన నొక్కి చెప్పారు (యోహాను 8:24), మారుమనస్సు యొక్క అవశ్యకతను గూర్చి తెలిపారు (లూకా 13:3), ఒప్పుకొనుట యొక్క ప్రాధాన్యతను గూర్చి మాట్లాడారు (మత్తయి 10:32). అయినా, ఆయన మరణ, సమాధి, పునరుత్థానాలు జరిగే వరకు ఆయన తన గ్రేట్ కమిషన్

(ఘనత్వముగల ఉత్తరువు)ను యివ్వలేదు. దేవుని కృపను అభినందించడానికి ప్రజలు ఏమి చేయాలో సూచిస్తూ, రక్షణ యొక్క షరత్తులను ఆయన అప్పుడు జారీ చేశారు.

> "కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులుగా చేయుడి, తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి..." (మత్తయి 28:19, 20).

> "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16).

> "క్రీస్తు శ్రమ పడి మూడవ దినమున మృతులలోనుండి లేచుననియు, యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయనపేరట మారుమనస్సు పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడియున్నది" (లూకా 24:46, 47).

ఈ రోజు చేయబడిన చట్టాని నిన్న అతిక్రమించిన ఏ మనిషి నేరస్థుడుగా ఎంచబడడు. దేశీయ చట్టమైనా అలాగే సూచిస్తుంది. గనుకనే సిలువ మీద ఆ దొంగ గ్రేట్ కమిషన్ యివ్వకముందే చనిపోయాడు, గనుక దాని షరత్తులు అతనికి వర్తించవు, గాని అవి మనకు తప్పక వర్తిస్తాయి. దొంగ బాప్తిస్మము పొందనవసరం లేదు, గాని మనకు అవసరముంది. అలాటప్పుడు, నేడు బాప్తిస్మం అవసరం లేదని చెప్పడానికి కొందరు ఎందుకు దీనిని ఉపయోగింప ప్రయత్నిస్తున్నారు?

## వాస్తవానికి సువార్త ప్రకటించబడకముందే అతడు రక్షింపబడ్డాడు

పౌలు ప్రకారం, సువార్తకు కీలకమైన మూడు ప్రధానాంశాలు: క్రీస్తు యొక్క మరణము, సమాధి, పునరుత్థానాలు. కొరింథీయులకు అతడు యిలా రాశాడు:

> మరియు సహోదరులారా, మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియ పరచుచున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచియున్నారు. మీ విశ్వాసము వ్యర్థమైతేనే గాని, నేను ఏ ఉపదేశ రూపముగా సువార్త మీకు ప్రకటించితినో ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొనిన యెడల ఆ సువార్త వలననే మీరు రక్షణపొందు వారైయుందురు. నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని. అదేమనగా లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపములనిమిత్తము మృతిపొందెను, సమాధి చేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినము లేపబడెను (1 కొరింథీ. 15:1-4).

దొంగకు పరదైసు వాగ్దానం చేయబడిన సమయం మొదలుకొని క్రీస్తు ప్రభువు యొక్క మరణం, సమాధి, పునరుత్థానాలు వెంటాడతాయి, కాని అప్పటికి ప్రభువు యింకను చనిపోలేదు; ఆయన సమాధి, పునరుత్థానాలు యింకను భవిష్యత్తులోనే ఉన్నాయి. వాస్తవంగా, ప్రభువు మృతులలోనుండి లేపబడేవరకు క్రొత్త నిబంధన సువార్త ప్రకటింపబడ

వీలులేకుండా ఉంది. క్రీస్తు ఆరోహణమైన పది దినాలకు పెంతెకొస్తు దినాన తొలిసారిగా పేతురుచే అది సంపూర్ణ రూపంలో ప్రకటింపబడింది (అపొ. 2:23, 24, 32, 36).

అద్భుతమైన ఆ సువార్త నేడు రక్షించు దేవుని శక్తియైయుంది (రోమా 1:16). అది లేకుండ నేడు మనం రక్షింపబడలేం. అది బహిరంగంగా ప్రకటింపబడకముందే దొంగ మరణించాడు. మొదటి సువార్త ప్రసంగం వినడానికి నోచుకోకుండగనే అతడు మృతినొందాడు, గనుక, అతని రక్షణ నేటి క్రైస్తవేతరునికి మాదిరియై యుండనేరవు (1 పేతురు 4:17; 2 థెస్స. 1:8).

## ముగింపు

ఆ దొంగ రక్షింపబడినట్టే నేడు అనేకులు రక్షింపబడగోరతారు "ఆ దొంగ బహు తెలివిగలవాడు! – తన జీవితమంతా తాను బ్రదుక కోరినట్టు బ్రదిగాడు–తరువాత, అతని మరణానికి ముందు, అతడు మారుమనస్సు పొందగా ప్రభువు వానిని రక్షించాడు; నేను కూడ అలాగే రక్షింపబడాలని" కొందరు అంటారు. సత్యాన్ని ఎరిగిన తరువాత, సత్యానికి లోబడడాన్ని త్రోసి పెట్టే పనిని బైబిలు ఉపదేశించదు లేక ప్రోత్సహించదు. "ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము" అని పౌలు తెలిపియున్నాడు (2 కొరింథీ. 6:2బి).

తన మరణానికి ముందువరకు మారుమనస్సును ఎవరైనా త్రోసిపెట్టియుండి నట్టయితే, ఈ క్రింద పేర్కొనబడిన వాటిలో – ఏదైనా ఒకటి జరిగియుండవచ్చు. మొదటిది, అతనికి ఆ అవకాశం కలుగక మునుసే ప్రభువు తిరిగి ప్రత్యక్షం కావచ్చు. రెండవది, ఎదురు చూడకుండగనే ఆ మనిషి మరణించవచ్చు. ఒకవేళ యింతలో ప్రభువు రాకపోయినా, లేక అతడు అనుకోకుండ చనిపోకపోయినా, మారుమనస్సు పొందనొల్ల కుండనంత కఠినంగా అతని మనస్సు కఠినంగా మారిపోవచ్చు (హెబ్రీ. 6:6 చూడు). హెబ్రీ రచయిత తన పాఠకులను యిలా అర్థించాడు: "నేడు మీరాయన శబ్దము వినినయెడల మీ హృదయములను కఠిన పరచకుడి" (4:7బి). చేయుమని ప్రభువు నీకు ఆజ్ఞాపించిన దానిని ఎన్నడే త్రోసిపుచ్చకు.

చనిపోయిన దొంగ యొక్క సిలువ మీద చూపును నిలపుట గాని, మనకొరకు మరణించిన రక్షకుని మధ్య సిలువపై దృష్టిని కేంద్రీకరించు. మనం నిజంగా ఆయనను ప్రేమించినట్టయితే, చేయుమని ఆయన మనకు సెలవిచ్చిన దానిని మనం తప్పక చేస్తాం (యోహాను 14:15). ఆయనకు లోబడుటలో సాకులు చెప్తూతూ దానిని మనం ముందుకు నెట్టి వేయకూడదు. పైగా, ప్రేమతోను కృతజ్ఞతతోను పొర్లిపారే హృదయాలతో, ఆయనకు లోబడుదాం.

---

సూచనలు

[1]రోము పౌరుల హక్కులను గూర్చి "కార్య గ్రంథం భాగం 6"ను చూడు. [2]అదే నిజమైతే యోహాను లేక యేసు ఉపదేశమును వినియుండవచ్చు. యేసు రాజ్యమును గూర్చి వివరించడానికి దొంగ పలికిన మాటలు సహాయపడుతాయి.
[3]*Grolier Multimedia Encyclopedia,* 1999 ed., s. v. "Constitution of the United States."